క్లుప్తంగా

నేడు ఉచిత రేబిస్ టీకాలు

మదనపల్లె సిటీ : ప్రపంచ జూనోసిస్ దినోత్సవ సందర్భంగా ఆది,సోమవారాల్లో పెంపుడు కుక్కలకు ఉచితగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు వెటర్నటీ ఏడీ డాక్టర్ రోహిణి తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత



చెత్తసేకరణను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

కేవీపల్లె : మండలంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతిస్తూ అన్ని ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామని ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. శనివారం ఉదయం మండలంలోని గర్నిమిట్టలో చెత్తసేకరణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోని చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. చెత్తసేకరణ బండి తమ వీధులకు వచ్చినప్పుడు తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వస్తువులు బహూకరణ



రెడ్డెమ్మతల్లికి వెండిశఠారిని బహూకరిస్తున్న దాతలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లికి భక్తులు వెండి వస్తువులు బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన నక్కాసతీష్, నాగరోజా దంపతులు శనివారం రూ. 30 వేలు విలువగల వెండి శఠారీని ఆలయ ఈవో మంజులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయల ప్రకారం శేషవస్త్రాలను సమర్పించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె : మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ షేక్ ముబారక్, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, చలపతి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కమిషనర్ కే.ప్రమీలకు కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉద్యోగ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవా, సాంబశివ, వాసు, కృష్ణప్ప, శంకర ప్రసాద్, చంద్ర, నరసింహులు, మల్లికార్జున పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

బి.కొత్తకోట : సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3న నియోజకవర్గ సభలు, 10, 11, 12న మదనపల్లెలో జిల్లా మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. 20 నుంచి 24 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మకర్తల అభ్యర్థిత్వాలు పరిశీలన



ధర్మకర్తల పదవికోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులతో దేవాదాయ శాఖ అధికారులు

పీలేరు : మండలంలోని స్థానిక రౌద్రాల అంకాలమ్మ దేవస్థానం, మదనపల్లె మార్గంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాలకు సంబంధించి ధర్మకర్తల పదవి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమావేశం నిర్వహించారు. శనివారం జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ స్థానిక అంకాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్తల పదవికో సం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రవీందర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ ఎస్. శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో దేవతామూర్తులను అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకొంది.

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.ఎ. బాబు కోరారు. ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో శనివారం స్థానిక గ్యారేజ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయాలని కోరారు. కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు బ్రేక్‌డౌన్‌పై గ్యారేజీ సిబ్బందిపై ఇస్తున్న చార్జీసీట్లు రద్దు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. బాషా, ఆర్.వి. రమణ, ట్రెజరర్ వేణుగోపాల్‌రెడ్డి, డెలిగేట్స్ కె.వి. రమణ, నాయకులు శ్రీను, దాము, ముని, ఎస్.ఎం. బాషా, రమణ, వేణు, గ్యారేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ఆర్టీసీ-2 డిపో కార్యాలయం ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా నిర్వహించారు. ఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్వీ కుమార్ మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లపై ఆదేశాలు జారీ చేయాలని, విద్యుత్ బస్సులను సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు పూల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, జాయింట్ సెక్రటరీ సుగుణ, బీసీఎస్ నాయక్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

మదనపల్లె సిటీ : బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఐసీడీఎస్ పీఓ నాగవేణి అన్నారు. శనివారం మదనపల్లె పట్టణ శివారు ప్రాంతమైన అమ్మచెరువుమిట్ట వద్దనున్న సంచార జాతుల ప్రజల గుడాల వద్దకు వెళ్లి వారి పిల్లను బడిలో చేర్పించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. సాక్షి దినపత్రికలో బడిబాట కాదు. .భిక్షాటన వార్తకు అధికారులు స్పందించారు. ఐసీడీఎస్, లేబర్ డిపార్టుమెంటు, విద్యాశాఖ అధికారులు సంచార జాతులు నివాసమున్న ప్రాంతానికి వెళ్లారు. వారి పిల్లల వివరాలు సేకరించారు. బడిఈడు పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తెలిపారు. బడిబయట పిల్లలను సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందితో సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, లేబర్ ఆఫీసర్, జిల్లా బాలపరిరక్షణ విభాగం అధికారి వెంకట రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత, సోషల్ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి(వాల్మీకిపురం) : ముందస్తు జాగ్రత్త చర్యలతోనే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట్లబావి గ్రామంలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఓ.ఆర్.ఎస్. ద్రావణం తయారు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బంది, స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సౌజన్య, ఏఎన్ఎం నిర్మల, సిబ్బంది వల్లి, వెంకటమ్మ, హేమలత పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 71 కేసుల పరిష్కారం



బాధ్యులను విచారణ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 71 కేసులు పరిష్కారించి రూ. 1,42,00,950 రికవరీ చేశారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జిల్లా 11 అదనపు ఇన్‌చార్జి జడ్జి పి.వి.ఎస్. సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు కక్షిదారులను ఒప్పించి పరిష్కరించారు. వివిధ బ్యాంకులు, వాహనాలు, బీఎస్ఎన్ఎల్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి రూ. 1,42,00952 రికవరీ చేశారు. చిత్తూరు ఫోక్స్ కోర్టు జడ్జి ఎం. శంకర్‌రావు, జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస్, ఏపీపీ శారద, న్యాయవాదులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం రెండవ అదనపు జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆధ్వర్యంలో జరిగిన లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు 25 పరిష్కరించి రూ.72,56,000, క్రిమినల్ కేసులు 144 పరిష్కరించి రూ.4,45,580 కక్షిదారులకు అందజేశారు.

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా 41 కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, బాండ్, మెయింటెనెన్స్, బ్యాంకు మొండి బకాయిలు తదితర కేసులకు సంబంధించి ఇరు వర్గాల వారిని విచారించిన జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ 41 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు అశోక్ కుమార్ రెడ్డి, న్యాయవాదులు ద్వారకనాథ రెడ్డి, మోడెం రవిప్రకాష్, జి.రమణ, వెంకటరెడ్డి, జేవీ రమణా రెడ్డి, సదాశివరెడ్డి, ఆర్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు మరువలేనివి



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

రామసముద్రం : రామసముద్రం మండలంలోని ఊలపాడు పంచాయతీ సచివాలయ సిబ్బంది సేవలు మరువలేని వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డివీరేగౌడు కొనియాడారు. శనివారం స్థానిక సచివాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి రజిత, సచివాలయ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ఎంతో కృషి చేశారన్నారు. ఎక్కడ వెళ్లిన సిబ్బంది మంచి గుర్తింపు పొంది ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో వైఎస్సార్ జయంతి

– పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం) : నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ నెల 8న మంగళవారం సేవా కార్యక్రమాలతో దివంగత నేత, మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నిర్వహించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో పేదలకు అన్నదానము, ఆసుపత్రిలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, రక్తదానం, ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పార్టీ నేతలతో పాటు జిల్లా, మండల అనుబంధ విభాగాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ కమిటీల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లిలో ఆదివారం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించే.. ఈ శిబిరంలో గుండె, క్యాన్సర్, కీళ్ల సమస్యలకు వైద్య నిపుణులు చికిత్స అందిస్తారు. ఈ శిబిరాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ సూచించారు.

10న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరు : గురుపౌర్ణమిని పురష్కరించుకుని ఈ నెల 10న పీలేరు నుంచి తిరువణ్ణామల్లై (అరుణాచలం)కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భక్తుల రద్దీని బట్టి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. దర్శనం తోపాటు గిరి ప్రదక్షిణకు అనువుగా బస్సులు నడుపుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441774743 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బండపడి కార్మికుడికి గాయాలు

మదనపల్లె సిటీ : గ్రానైట్ బండ పడి ఓ కార్మికుడు గాయపడిన సంఘటన మదనపల్లె మండలం వలసపల్లెలో శనివారం జరిగింది. వలసపల్లెలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేసే బీహార్ రాష్ట్రం బెగుసలేకు చెందిన అభిషేక్ (23) ఫ్యాక్టరీలో బండలు పాలీస్ చేసే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పని చేస్తుండగా ప్రమాదశాత్తు గ్రానైట్‌రాయి కాలుపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు చేశారు.

బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

కేవీపల్లె : మదనపల్లెలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లంగి చంద్రయ్య డిమాడ్ చేశారు. శనివారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ అంబేడ్కర్ విగ్రహం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బుద్ధుడి విగ్రహాలకు రక్షణ కరువైందన్నారు. ఇటీవల కేవీపల్లె మండలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, అది మరువకనే మదనపల్లె సమీపంలోని బుద్ధుడి కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. ఎ. శ్రీనివాసులు, ఎ. నాగేశ్వర, ఆంజినేయులు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ విధానంతో ఎంబీబీఎస్‌కు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

మదనపల్లె : విద్యారంగంలో అత్యున్నతమైన వైద్యను పేద విద్యార్థులకు రాష్ట్రంలోని కూటమి చేస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి హేమంత్‌కుమార్ విమర్శించారు. శనివార స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యవిద్య, సేవలపై ప్రభుత్వ పీపీపీ విధానంతో మెరిట్ విద్యార్థులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలను వంద శాతం ప్రభుత్వం పరంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పుడు దానిని విస్మరించి ప్రైవేటు విద్యా సంస్థలకు దోచిపెట్టేందుకు పీసీసీ విధానం తీసుకువస్తున్నారని విమర్శించారు. ఫలితంగా వైద్య కళాశాలలు పూర్తిగా కార్పొరేట్ శక్తుల పరమై రాష్ట్రంలో పేద మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ కలగా మారుతుందన్నారు. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలల్లో వందల పడకలతో పేదలకు ఉచిత వైద్యం అందించే అవకాశం కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వైద్యమంత్రి సత్యకుమార్ ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలను నడపలేమని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ చర్య ద్వారా పేదలకు అందించే ఉచిత వైద్యం కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు ప్రశాంత్, ఖాదర్, బాబి, రెడ్డి ప్రశాంత్, రేవంత్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



లక్కీడిప్ తీస్తున్న డీఎం అమర్‌నాథ్

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ అమర్‌నాథ్ తెలిపారు. శనివారం స్థానిక బస్‌స్టేషన్‌లో మదనపల్లె-కలకడ, మదనపల్లె-రామసముద్రం మార్గంలో ప్రయాణించిన వారి టిక్కెట్లను లక్కీడీప్ తీశారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ ఆదరించాలని కోరారు. ఇటీవల ప్రయాణికుల కోసం కొత్త బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లక్కీడిప్‌లో గెలుపొందిన వారు డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీఐ గీత బదిలీ

టు డిపోలో సీఐగా పనిచేస్తున్న గీత కడప ఈడీ కార్యాలయానికి బదిలీ కావడంతో సిబ్బంది సన్మానించారు. డిపో అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పిరెడ్డి, రాజు,ఝాన్సీ, రమణ, ప్రతాప్‌కుమార్, ఎన్ఎంయు వినోద్‌బాబు, చలపతి, ఈయూ హుస్సేన్, వాసులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారంపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

బి.కొత్తకోట : ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం బి.కొత్తకోటలో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని నినాదాలు చేశారు. ఏడాదిలో నాలుగుసార్లు విద్యుత్‌చార్జీలను పెంచిన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచిపోయిందని నాయకులు విమర్శించారు. నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్ల పెంచిన భారాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను అమర్చితే వాటిని పగులగొట్టండి అని పిలుపు ఇచ్చిన మంత్రి లోకే ష్ ఇప్పుడు అదేపని చేస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బషీర్, రఘునాథ్, అప్రఫల్లీ, మంజునాథ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలియజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే విద్యుత్ సర్దుబాటు పేరుతో రూ.15.485 కోట్లు ప్రజలపై భారం మోపిందన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, మురళి, తిరుమలప్ప, దేవ, ముబారక్, రాధ, వాసు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పట్టించుకోరా?





ఆసుపత్రిలోని కిటికీల అద్దాలను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మదనపల్లె : స్థానిక ఇరిగేషన్ ప్రాంగణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం భవనం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది ప్రతి రోజు విధులకు వస్తున్నారు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నారే తప్పా.. ఆసుపత్రిలో ఏం జరుగుతోంది. ఎవరు వస్తున్నారు. ఏం చేస్తున్నారనే సంగతే పట్టించుకోవడం లేదు. ఇటీవల కొందరు దుండగులు ఆసుపత్రి కిటికీ అద్దాలను పగలకొట్టారు. ఈ ఘటనపై వైద్యులు కానీ సిబ్బంది కానీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారే తప్పా ఎవరూ స్పందించలేదు. భవనం చుట్టూ ఉన్న కిటికిల అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, పాఠశాలలు ఉన్నాయి. అయినా ఎవరు ధ్వంసం చేశారు.. అనేది ప్రశ్నగా మిగిలింది. దీనిపై సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పగిలిన కిటికి అద్దాలు వీరికి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కలకడ : ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం కలకడ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆటో డ్రైవర్ల డిమాండ్‌లకు సబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.15,000 నగదు ఇవ్వాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు సయ్యద్ బాష, సూరత్‌బాషా, సాదిక్‌అలీ, జబ్బీర్, జావీద్‌ఖాన్, ఏఐటీయూసీ మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డెప్ప, మురళి, కరీముల్లా, రవి, జహంగీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



తంబళ్లపల్లె: మొహర్రం ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ



పెద్దతిప్పసముద్రం: పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో పెద్దపీరు

తంబళ్లపల్లె: హిందూ ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పండుగ మొహర్రం. మండల కేంద్రంలో హిందూ ముస్లింలు మొహర్రం పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ మొహర్రం సంబరాల్లో పాల్గొన్నారు. పీర్లను ముస్తాబు చేసేందుకు పుష్పాల బాసికాలను అందజేశారు. అనంతరం ఆమెప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి పెద్దపీరును పుష్పాలతో అలంకరించి ఊరేగించారు.

ఘనంగా పీర్ల మెరవణి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో శుక్రవారం రాత్రి పెద్ద పీర్ల మెరవణి వైభవంగా జరిగింది. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా వారం రోజులుగా గ్రామ చావడిలో కొలువైన పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. చుట్టు పక్కల మండల వాసులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు ఊరేగింపును తిలకించారు. భక్తులు ముడుపులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం జల్ది కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఊరేగింపు

మదనపల్లె సిటీ : మొహర్రం సందర్భంగా జామియా మసీదు వద్దనున్న పపయ మకాన్‌లోని మౌలాలీ పీర్ల చావిడిలో పెద్ద పీరును శనివారం ఊరేగించారు. మొదట పీర్లకు మకాన్‌దార్ మౌలాలి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ ముస్లింలు చక్కర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున పీర్లను దర్శించుకున్నారు. అలాగే తాటిమాన్ల వద్దనున్న పీర్లు, వన్నూర్‌సాహెబ్ గుట్టవద్దనున్న పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.